సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం ၊ 6 ၊ అక్టోబర్ ၊ 2024



సోమశిలలో 52.253 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 52.253 టీఎంసీల నీరు ఉంది. పై ప్రాంతాల నుంచి 7,150 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్ డెల్టాకు 2 వేలు, ఉత్తర, దక్షిణ కాలువలకు 9,040 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,220
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,120
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,334
నవర (8 గ్రాములు)	రూ.58,672

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.6 /26.0

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 59 శాతంగా శనివారం నమోదైంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌డీఏ పీడీ



నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నాగరాజకుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లాలో ఆమె దివ్యాంగుల శాఖ ఏడీగా పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన పీడీని అడిషనల్ పీడీ రాజు, డీపీఎంలు, ఏసీలు ఎంపీఎంలు కలిసి అభినందనలు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపు

- మంత్రి నారాయణ



16వ డివిజన్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరాభివృద్ధి, ప్రజల భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అక్రమ కట్టడాలను తొలగించే ఆపరేషన్ యుద్ధ ప్రాతిపదికన ప్రారంభిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. నగరంలోని 16, 50 డివిజన్ల ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని ప్రధాన కాలువలను ఆక్రమించుకుని అక్రమ కట్టడాలను నిర్మించి ఉంటే ఎవరికి వారు ఖాళీ చేయాలని సూచించారు. నిరుపేదలు కాలువగట్ల మీద నివసిస్తుంటే వారికి సరైన ప్రత్యామ్నాయం చూపిస్తామన్నారు. టీడీపీ నేతలు అయినా సరే అక్రమ కట్టడాలకు పాల్పడి ఉంటే వాటిని నిర్దాక్షిణ్యంగా, నిష్పక్షపాతంగా తొలగిస్తామని తెలిపారు. షాడో ఎమ్మెల్యేలు, మంత్రులు లేరని నారాయణ అంటే ఏమిటో ప్రజలకు నిజా నిజాలు తెలుసన్నారు. నగరంలోని పార్కులను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు.

108 మంది అభ్యర్థుల గైర్హాజరు

నెల్లూరు (టౌన్): జిల్లాలో శనివారం రెండు సెషన్స్‌లో జరిగిన టెట్‌కు 108 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 825 మందికి 733 మంది హాజరు కాగా 92 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 116 మందికి 100 మంది హాజరయ్యారు. 16 మంది గైర్హాజరయ్యారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఆరు నుంచి శనివారం వరకు కానుకల రూపంలో రూ.17,21,022 భక్తులు సమర్పించారని ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలకమండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, దేవదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ప్రాకారోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో తిరుమంజనం, ప్రాకారోత్సవాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా బాలాజీ, జయంతి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

తమ్ముళ్ల మేత.. ఇసుక కొరత



'మన ప్రభుత్వం వస్తే ఇసుకను ఉచితంగా ఇచ్చే బాధ్యత నేనే తీసుకుంటా.. అంటూ ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు'. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుకను తమ్ముళ్లకు మేతగా మార్చేశారు. సామాన్యులకు తట్టెడు ఇసుక దొరకనివ్వకుండా వాగులు, వంకలు, నదుల్లో దోపిడీకి పాల్పడుతున్నారు. గతంలో టీడీపీ హయాంలో ఉచిత ఇసుక పేరుతో జరిగిన దోపిడీకి కళ్లెం వేసేందుకు ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుక పాలసీ రూపొందించేందుకు నెల రోజులు ఇసుక తవ్వకాలను ఆపేస్తే ఇదే టీడీపీ నానా యాగీ చేసింది. పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా.. నిర్మాణాలకు ఇసుక ఇవ్వకపోగా, ఉన్న ఇసుకను అక్రమ మార్గంలో బ్లాక్ మార్కెట్లోకి అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు.



పోతిరెడ్డిపాళెం వద్ద డ్రెడ్జింగ్‌తో ఇసుకను బయటకు తరలిస్తున్న పడవలు

- జిల్లాలోని యార్డుల్లో ఇసుక నిల్వలు నిల్
- ఎన్‌జీటీ అనుమతులు రాక అధికారిక తవ్వకాల నిలిపివేత
- అడ్డదారిలో పెన్నానదిలో పూడికతీత పేరుతో డ్రెడ్జింగ్ ద్వారా తవ్వకాలు
- మూడు ప్రాంతాల్లో తవ్వే ఇసుకకు లెక్కా పత్రం లేదు
- అయినా స్థానికంగా నిర్మాణాలకు తట్టెడు దొరకని వైనం
- రోజుకు వేల టన్నులు విచ్చలవిడిగా అక్రమ రవాణా
- అర్ధరాత్రి పూట బ్లాక్ మార్కెట్లో కావాల్సినంత ఇసుక
- జిల్లాలో నిర్మాణ రంగం కుదేలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో ఇసుక టీడీపీ నేతలకు రూ.కోట్లు కురిపిస్తోంది. ప్రజలకు మాత్రం పగటి పూటే చుక్కలు చూపిస్తోంది. ఉచితం ఇసుక ప్రభుత్వ ప్రచారాస్త్రమే తప్ప.. కొందామన్నా.. సామాన్య ప్రజలకు తట్టెడు కూడా దొరకడం లేదు. ఇసుక కొరతతో మూడు నెలలుగా నిర్మాణం రంగం నిలిచిపోయింది. బ్లాక్ మార్కెట్లో అయితే కావాల్సినంత దొరుకుతుంటే ఆ ధరలకు ఇసుక కొనుగోలు చేసి నిర్మాణాలు చేయలేక యజమానులు, పనులు దొరక్క కూలీలు బావురుమంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం జిల్లాలో ఎనిమిది ఇసుక యార్డుల్లో సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను ఉంచింది. టీడీపీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వం ఏర్పాటుకాక ముందే ఎక్కడికక్కడ ఆ పార్టీ నేతలు నిల్వలను కాజేశారు. చివరకు మర్రిపాడు యార్డులో 1,25,211 మెట్రిక్ టన్నులు, మినగల్లులో 41,885 మెట్రిక్ టన్నులు, పల్లిపాడులో 8,205 మెట్రిక్ టన్నులు లెక్కలు చూపించి టన్ను ఇసుక ధర రూ.370 వంతున విక్రయాలు ప్రారంభించారు. వాస్తవానికి ఇందులో రెండింతలు అనధికారికంగా టీడీపీ నేతలు అక్రమంగా రూపాయి చెల్లించకుండా అమ్ముకున్నారు. మినగల్లు యార్డులోనే 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను కోవూరు ఎమ్మెల్యే బంధువు అక్రమంగా తరలించినట్లు మైనింగ్ శాఖాధికారులే నిర్ధారించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 8 యార్డుల్లో ఇసుక నిల్వలు చేస్తే.. టీడీపీ 3 యార్డుల్లో నిల్వలు చూపించిందటే ఆ పార్టీ నేతలు ఏ స్థాయిలో ఇసుక దోపిడీకి పాల్పడ్డారో అర్థమవుతోంది.

అధికారికంగా యార్డుల్లో నిల్వలు నిల్

జిల్లాలో టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు యార్డుల్లో అధికారికంగా ఇసుక నిల్వలు ఖాళీ అయిపోయాయి. పెన్నానది నుంచి ఇసుక తవ్వకాలకు ఇప్పటి వరకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి లభించలేదు. ఇదంతా అధికారికంగా ఒక కోణమే అయితే.. సోమశిల ప్రాజెక్ట్ దిగువ నుంచి బంగాళాఖాతం వరకు ఉన్న పెన్నానదిలో అడుగడుగునా టీడీపీ నేతలు విచ్చలవిడిగా తవ్వకాలు చేసి పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటున్నారు. ఇసుక తవ్వకాలకు అనుమతి లేకపోయినా.. ఇంత స్థాయిలో ఇసుక ఎలా వస్తుందనే అనుమానాలు వస్తాయని, పెన్నానదిలో మూడు చోట్ల పూడిక తీత పేరుతో ఇసుక అందుబాటులోకి వస్తుందని చెప్పి.. అక్రమ తవ్వకాలతో చెలరేగిపోతున్నారు. ఇంత స్థాయిలో ఇసుక లభ్యత ఉన్నా.. సామాన్య ప్రజలకు మాత్రం ట్రక్కు ఇసుక దొరకడం గగనంగా మారింది. డిమాండ్‌ను బట్టి టన్ను రూ.2 వేలు వంతున విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా కేవలం ఇసుక అక్రమ రవాణా కోసమే 150 వాహనాలను కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారంటే ఏ స్థాయిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందో అర్థమవుతోంది.

20 టన్నుల ఇసుక రూ.30 వేలు

నెల్లూరు, కోవూరు నియోజకవర్గాల్లో ప్రజల అవసరాలు తీర్చేందుకు నెల్లూరు బ్యారేజీకి ఎగువ ప్రాంతం పోతిరెడ్డిపాళెం వద్ద డ్రెడ్జింగ్ ద్వారా తవ్విన ఇసుకను కోవూరు షుగర్ ఫ్యాక్టరీ దగ్గర స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. అధికారికంగా ఇక్కడ 10,269 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. కానీ ఇక్కడి నుంచి సామాన్యులు ఇసుక కొనుగోలు చేయాలంటే గగనమే అవుతోంది. అనధికారికంగా అయితే కావాల్సినంత ఇసుక బ్లాక్ ధరలకు అయితే ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరుకుతోంది. ఇక ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక కావాలంటే ఎంత కాలం ఎదురు చూసినా నిరాశే. ఇసుక రవాణా కోసం ఏర్పాటు చేసిన పోర్టల్ సైట్ అర్ధరాత్రి 1.30 గంటలకు ఓపెన్ అయితే 2 గంటలకు ఆగిపోతుంది. ఈ అర్ధగంటలో టీడీపీ నేతలే బుకింగ్ చేసి బ్లాక్‌లో విక్రయిస్తున్నారని సమాచారం. ఒక టిప్పర్ ఇసుక (20 టన్నులు) కావాలంటే రూ.30 వేల లెక్కన విక్రయిస్తున్నారు. అదే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే 20 టన్నుల ఇసుక రూ.6 వేలు, రవాణా రూ.5 వేలు కలుపుకుంటే రూ.11 వేలకు దొరుకుతుంది. కానీ సామాన్యులకు ఇసుక దొరకకుండా 'ఆన్‌లైన్' బ్లాక్ చేసి బ్లాక్ దందా చేస్తున్నారు.



కోవూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఇసుక డంప్

వంద రోజుల్లోనే రూ.100 కోట్ల మేర అక్రమ ఇసుక రవాణా

టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ.100 కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. మర్రిపాడు, పల్లిపాడు, మినగల్లు డంపింగ్ యార్డుల నుంచి దాదాపు రూ.15 కోట్ల విలువైన ఇసుకను అనధికారికంగా తరలించారు. నెల్లూరురూరల్‌లో రాత్రి వేళల్లో పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేయించారు. బుచ్చిరెడ్డిపాళెంలో షాడో ఎమ్మెల్యే ఏకంగా 15 వేల టన్నుల ఇసుక మాయం చేశారు. ఇక కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో వాగులు వంకల నుంచి ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతోంది.



ఆత్మకూరులో ఇసుకను తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

డ్రెడ్జింగ్ ఇసుకతో అర్ధరాత్రి వ్యాపారం

నెల్లూరు బ్యారేజీ సమీపంలో పొతిరెడ్డిపాళెం, సంగం బ్యారేజీ సమీపంలో ఎగువ భాగంలో సంగం వద్ద, దిగువ భాగంలో సూరాయపాళెం వద్ద పెన్నానదిలో పూడిక తీత పేరుతో ఇసుక తవ్వకాలు చేపట్టి ప్రజల అవసరాలు తీరుస్తామని అధికారులు ప్రకటించారు. అయితే ఈ మూడు ప్రాంతాల్లో తవ్వే ఇసుకకు లెక్కాపత్రం కూడా లేదు. ఎంత మేర ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఎంత మేర విక్రయాలు చేస్తున్నారో అధికారికంగా ప్రకటనలు లేవు. కాకి లెక్కలతో వేల టన్నుల ఇసుకను అక్రమంగా అమ్ముకుంటున్నారు. ప్రతి రోజు అర్ధరాత్రి దాటాకే బ్లాక్ ధరలకు అక్రమంగా ఇసుక విక్రయాలు చేసి జేబులు నింపుకుంటున్నారు.

17 చోట్ల ఇసుక తవ్వకాలు

ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో విస్తరించిన పెన్నానదితో పాటు బొగ్గేరు, కావేరి వాగుల్లో అనధికారికంగా 17 చోట్ల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. పెన్నానదిలో చేజర్ల మండలంలో పీకేపాడు, మడపల్లి, కోటితీర్థం, అనంతసాగరం మండలంలోని పడమటి కంభంపాడు, రేవూరు, శంకరనగరం, ఆత్మకూరు మండలంలోని బండారుపల్లి, అప్పారావుపాళెం, వాశిలి మడుగు నుంచి ఇసుక రవాణా సాగుతుండగా, బొగ్గేరు నుంచి ఆత్మకూరు, దేపూరు, బోయిలచిరివెళ్ల, నాగులపాడు గ్రామాల పరిధిలో ఇసుక రవాణా సాగుతోంది. పెన్నానదిలో సంగం మండలంలోని దువ్వూరు, అన్నారెడ్డిపాళెం, నుంచి ఇసుక రవాణా సాగుతోంది. ఆయా ప్రాంతాల నుంచి టిప్పర్ల ద్వారా చెన్నై, బెంగళూరు నగరాలకు తరలించి తమ జేబులు నింపుకుంటున్నారు. స్థానిక టీడీపీ నేతలు 30 నుంచి 40 ట్రాక్టర్ల ద్వారా పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇందు కోసమే టీడీపీ యువ కార్యకర్తలు పెద్ద ఎత్తున ట్రాక్టర్లు కొన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినా.. అటువైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 30 టన్నులు చెన్నై, బెంగళూరు నగరాలకు తరలిస్తే.. రూ.80 వేల నుంచి రూ.లక్షకు అమ్ముకుంటున్నారు. ఆత్మకూరు మండలంలోని బండారుపల్లి, వాశిలి మడుగు వద్ద నుంచి పెన్నానది ఇసుకను అక్రమంగా తరలిస్తూ టీడీపీ మండల గ్రామ నాయకులు దోచుకుంటుండగా రెండు రోజులుగా సీఐ, ఎస్సైలు దాడులు నిర్వహించి ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఇలా పోలీసులు ఒక మండలంలో ఒకలా, ఇంకో మండలంలో మరోలా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఇసుక ధరలకు రోజు రోజుకు రెక్కలు

కందుకూరు నియోజకవర్గంలో ఇసుక ధరలు భారీగా పెంచేశారు. కందుకూరు మండలం పాలూరు, దొండపాడు, మాచవరం ఉలవపాడు మండలం మధ్దిపూడి, మన్నేటికోట వద్ద మన్నేరు నుంచి, వెంకన్నపాళెం, పందలపాడు వద్ద పాలేరు నుంచి, గుడ్లూరు మండలంలోని గుండ్లపాళెం, వలేటివారిపాళెం మండలంలోని కళవళ్ల, లింగసముద్రం మండలంలోని అన్నేబోయినపల్లి, వీఆర్ కోటల్లో మన్నేరు నుంచి, పెద్దపవని, ముత్యాలపాడు వద్ద ఉప్పుటేరు నుంచి అక్రమ ఇసుక రవాణా సాగుతోంది. పది రోజుల క్రితం ట్రక్కు ఇసుక రూ.2,500 నుంచి రూ.3,000లకు విక్రయించారు. తాజాగా రూ.4,000 నుంచి రూ.5,000లకు విక్రయిస్తున్నారు. గుడ్లూరు, లింగసముద్రం మండలాల నుంచి కావలి, పామూరు, కొండాపురానికి ఇసుక తరలిస్తున్నారు. దొండపాడు, పాలూరు వద్ద మన్నేరు నుంచి కేవలం ఆయా గ్రామాల టీడీపీకి చెందిన ట్రాక్టర్లు మాత్రమే ఇసుకను తరలించాలి. మదనగోపాలపురం సమీపంలోని మామిడితోటలో ఇసుక డంప్ చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు.



సంగం వద్ద పెన్నానదిలో డ్రెడ్జింగ్‌తో ఇసుక తవ్వకాలు

సామాన్యులకు చుక్కలు

జిల్లాలో ఇసుక అవసరాల కోసం పెన్నాలో డ్రెడ్జింగ్ విధానం ద్వారా ఇసుకను తరలించి డంపింగ్ చేసి విక్రయాలు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఆ డంపింగ్ యార్డులను తమ్ముళ్లే స్వాధీనం చేసుకుని అనధికారికంగా ఇసుకను తరలిస్తున్నారు. సామాన్యుడికి ఇసుక దొరకాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. వాహనదారులకు ఇసుక కావాలని అడిగితే యూనిట్ ఇసుక నగరంలోకి రావాలంటే రూ.8 వేలు వంతున డిమాండ్ చేస్తున్నారు. సామాన్యుడు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేందుకు వీలు లేకుండా చేశారు. కేవలం అర్ధరాత్రి అరగంట పాటు పోర్టల్‌లో సైట్ ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో బుకింగ్ జరిగేలా చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక విక్రయాలు జరుగుతున్నాయంటూ చూపించి ప్రజలను మోసం చేస్తున్నారు.

ఒక్కొక్కరి నెల సంపాదన సుమారు రూ.70 లక్షలపైమాటే

ఉదయగిరి నియోజకవర్గంలో ఇసుక విక్రయాలతో టీడీపీ ముఖ్య నేతలు ఒక్కొక్కరు నెలకు రూ.70 లక్షలకుపైగానే సంపాదిస్తున్నారని స్థానికంగా జరుగుతున్న ఇసుక రవాణాను బట్టి అర్థమవుతోంది. టీడీపీ అధికారంలోకి రాగానే తమ్ముళ్లు వాగులు, వంకల్లో ఉన్న ఇసుకను నిత్యం అక్రమ రవాణా చేస్తూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. వింజమూరు, ఉదయగిరి, వరికుంటపాడు, కొండాపురం, దుత్తలూరు మండలాల పరిధిలోని ప్రధాన వాగుల్లో దొరికే నాణ్యమైన ఇసుకను నిత్యం 50 నుంచి 60 ట్రిప్పులు అక్రమ రవాణా సాగుతోంది. దూరాన్ని బట్టి ఒక ట్రాక్టరు ఇసుక రూ.3,500 నుంచి 5,000 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రేయింబవళ్లు ట్రాక్టర్ల ద్వారా ఇసుక దందా కొనసాగుతున్నా.. పోలీసులు, అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలవారీ మామూళ్లు తీసుకుంటూ ఈ అక్రమ దందాకు పచ్చజెండా ఊపుతున్నారు. సామాన్యులు తమ ఇంటి నిర్మాణానికి ట్రాక్టరు ఇసుక తోలేందుకు ప్రయత్నించినా పోలీసులు వెంటనే అక్కడికి వాలిపోయి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల మేర అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు అంచనా. ఈ విధంగా నెలకు సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షలు కేవలం ఒక్క ఇసుక ద్వారానే తెలుగు తమ్ముళ్లు అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు.



పిల్లాపేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

చూపించేది కొంత.. తరలించేది మరింత

సర్వేపల్లి నియోజకవర్గంలో ఉచిత ఇసుక విధానానికి అర్థం లేకుండా పోయింది. పొదలకూరు మండలం సూరాయపాళెం ఇసుక రీచ్‌లో ప్రస్తుతం 10,474 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. ఇక్కడి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేసేందుకు టీడీపీ నేతలే ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుని బయట అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. సూరాయపాళెం నుంచి పొదలకూరుకు టిప్పర్ రూ.14,500లకు తోలాలి. అయితే టీడీపీ నేతలు బినామి పేర్లపై ఇసుకను బుక్ చేసుకుని 20 టన్నుల ఇసుక రూ.20 వేల వరకు అమ్ముతున్నారు. సచివాలయంలో వెబ్‌సైట్లో ఇసుకను బుక్ చేసుకోవాల్సి ఉండగా వారంలో ఒక పర్యాయం మాత్రమే ఇసుకను బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటల సయమంలో ఆన్‌లైన్లో ఇసుకను బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడం వల్ల సామాన్యుడికి దక్కడం లేదు. కేవలం 20 నిమిషాల తర్వాత నో స్టాక్ వస్తున్నట్టు టిప్పర్ల యజమానులు తెలిపారు. ఆ సమయం తెలుసుకుని టీడీపీ నేతలే ఇసుకను బుక్ చేసుకుని బ్లాక్ రేట్లకు సొమ్ము చేసుకుంటున్నారు.

మత్స్య సంపద ప్రాసెస్డ్ యూనిట్ల ఏర్పాటు

- కడలూరు, నెల్లూరు మత్స్యకారుల వివాదాల పరిష్కారానికి చర్యలు
- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ సభలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, బీజేపీ నేతలు



పురమందిరంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న నగర ప్రజలు

నెల్లూరు (బృందావనం): రాష్ట్రంలో సముద్ర తీరం వెంబడి మత్స్య ఆధారిత ఉపాధి కల్పన, సంపద పెంపొందించేందుకు విస్తృతంగా ప్రాసెస్డ్ యూనిట్లు, ఎగుమతికి ఏర్పాట్లు చేస్తామని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. స్థానిక పురమందిరంలో శనివారం రాష్ట్ర ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ 3వ ఉత్సవాలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యయోజన పథకం కింద కోట్లాది రూపాయలు రాష్ట్రాలకు అందజేస్తున్నామన్నారు. మత్స్యకారులకు కేంద్రం రాయితీలు ఇచ్చి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో పోర్టులు, జెట్టీలు, ఫిష్ ల్యాండ్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్రం అందిస్తున్న పథకాలపై మత్స్యకారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తమిళనాడు రాష్ట్రం కడలూరు జాలర్లు నెల్లూరు జిల్లా సముద్ర ప్రాదేశిక జలాల్లో ప్రవేశించడంతో స్థానిక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ఫెస్టివల్స్ పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్రంలో చేపల వినియోగం, ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తీర ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కడలూరు నుంచి నెల్లూరుకు చేపల వేటకు వచ్చే మత్స్యకారులను నియంత్రించేందుకు పెద్ద మర బోట్లును వినియోగించినట్లైతే వారిని నిరోధించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టుకు కంటైనర్లు తిరిగి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీని వల్ల ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లు ఆదాయం రాకుండా పోయిందన్నారు. 10 వేల మంది ఉద్యోగావకాశాలు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, మత్స్యకార సంఘాల నాయకులు పోలయ్య, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రంగనాథ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాపై మళ్లీ కరువు పంజా

- కరువు మండలాలను గుర్తించే పనిలో అధికారులు
- 2019 – 24 మధ్య సకాలంలో వర్షాలతో పంటల సాగు
- తిరిగి ఈ ఏడాది కరువు కోరల్లోకి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో చాలా తక్కువగా సాగు చేయడంతో పాటు వర్షపాతం తగినంత నమోదు కాకపోవడంతో ఖరీఫ్ సీజన్ మొత్తం కరువు కోరల్లో చిక్కుకుంది. ప్రస్తుత పరిస్థితి చూస్తే 2014 – 19 నాటి పరిస్థితి పునరావృతమైందాననే అనుమానాలు తలెత్తుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో వర్షాలతో పచ్చని పంటలతో కళకళలాడిన జిల్లా ప్రస్తుతం ఎటు చూసినా బీడు భూములతో నీటి కోసం ఎదురు చూస్తోంది.

కరువు మండలాల గుర్తింపు

జిల్లాలో ప్రస్తుతం 37 మండలాలున్నాయి. ఇందులో ఉదయగిరి, మర్రిపాడు ప్రాంతాల్లో కొద్దిగా వర్షాలు పడ్డాయని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గుర్తించారు. మిగిలిన 35 మండలాల్లో 80 శాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ విషయం ఉన్నత స్థాయి అధికారులకు తెలియడంతో వ్యవసాయశాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి, జిల్లాలో 35 కరువు మండలాలను గుర్తించినట్లు తెలుస్తోంది. కరువు మండలాల్లోని ఏయే ప్రాంతాల్లో వర్షపాతం తక్కువగా ఉందనే విషయాలపై సమగ్ర నివేదికను తయారు చేసి పంపాలని రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రతిపాదనలను రూపొందించే పనిలో వివిధ శాఖల అధికారులున్నారు.

ఎలా గుర్తిస్తారంటే..

జిల్లాలో ఎక్కడైనా కరువు ఉందంటే దానికి తగిన విధంగా వివిధ శాఖల అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి అన్ని రకాలుగా పరిశీలిస్తారు. ప్రధానంగా ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ మొదటి వారంలోపు జిల్లాలోని ఆయా మండలాల్లో ఎంత మేర వర్షాలు పడ్డాయి.. వర్షపాత శాతం ఎంత నమోదైందనే వివరాలను సేకరిస్తారు. 80 శాతం కన్నా తక్కువ నమోదైతే ఆయా ప్రాంతాల్లోని చెరువుల్లో సాగు నీరుందా.. గతంలో ఆయా ప్రాంతాల్లో ఎంత మేర పంటలు సాగు చేశారు.. ప్రస్తుతం నీటి కొరతతో ఎంత సాగు చేస్తున్నారనే వివరాలను తీసుకుంటారు. వీటి ఆధారంగా స్థానిక రైతుల అభిప్రాయాలతో వాటిని కరువు మండలాలుగా ప్రకటిస్తారు. గతంలో అక్టోబర్ ప్రారంభ సమయానికి దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులో ఉండేవి. ప్రస్తుతం మొత్తమ్మీద 52 వేల ఎకరాల్లోపు మాత్రమే సాగులో ఉందని అధికారులు గుర్తించారని తెలుస్తోంది. దీంతో కరువు మండలాలుగా నిర్ణయించి వాటికి సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు.

2014 పరిస్థితే రిపీట్

గతంలో 2014 – 19 వరకు జిల్లాలో కరువు పరిస్థితిని చూసి రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అప్పట్లో ఒక సంవత్సరంలో తీవ్ర వర్షాభావంతో్ల కొద్దిగా వేసిన సాగు సైతం అప్పటి తుఫాన్ దాటికి కొట్టుకుపోయి, రైతులు నష్ట పోయారు. మిగిలిన నాలుగేళ్లు సాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పట్లో ప్రతి ఏడాది 25 నుంచి 30 మండలాల వరకు కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తూ వచ్చారు.

2019 నుంచి సకాలంలో..

2019 నుంచి 2024 వరకు సకాలంలో అన్ని మండలాల్లో వర్షాలు పడుతూ వచ్చాయి. సోమశిల నిండు కుండలా ఉండేది. జిల్లాలోని చెరువులు, చిన్న కాలువల్లో సైతం నీటి లభ్యత ఉండింది. దీంతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటంతో ఏటా జిల్లాలో రబీ, ఖరీఫ్ కలిపి ఏడు లక్షల ఎకరాలకు పైగా కేవలం వరి సాగులో ఉండేది. మిగిలిన మినుము, పెసర, ఇతర పంటలను సాగు చేసుకునే వారని పలువురు రైతులు నాటి రోజులను గుర్తు చేసుకుంటున్నారు.

వ్యాపారాలు నిల్..

ఏటా రబీ, ఖరీఫ్ సీజన్లలో ఎరువు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు అధికంగా ఉండేవి. గతంతో పోలిస్తే కనీసం 25 శాతం కూడా విక్రయాలు ప్రస్తుతం లేవని పలువురు ఫర్టిలైజర్స్ నిర్వాహకులు వాపోతున్నారు. నీటి లభ్యత లేక పోవడంతో సాగు జరగక వ్యాపారాలపై ప్రభావం పడిందని తెలుస్తోంది.

ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నాం



గడిచిన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కరువు మండలాల జాబితా ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నాం. వర్షపాత నమోదు, నీటి లభ్యత, సాగు చేస్తున్న పంటల పూర్తి వివరాలతో ప్రతిపాదనలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నాం.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

నీటి లభ్యత తక్కువగా ఉంది



చాలాచోట్ల గతంలో కంటే తక్కువగా వర్షం పడింది. నీటి లభ్యత స్వల్పంగా ఉంది. సోమశిలలో నీరు ఉందని చెప్తున్నా, ఎప్పుడు విడుదల చేస్తారో తెలియడం లేదు. వర్షంపై ఆధారపడి వేసే పంటలు చాలా ఉన్నాయి. వర్షాల్లేకపోవడంతో ఆయా పంటలు వేసే పరిస్థితి లేదు.

– పెంచలయ్య, రైతు, మహిమలూరు

సాగుకు వెనుకాడే పరిస్థితి



జిల్లాలో వర్షాల్లేకవడంతో ఖరీఫ్‌లో సాగు చేయలేని పరిస్థితి నెలకొంది. గతంలో 25 ఎకరాల వరకు కౌలుకు తీసుకొని సాగుచేసే వాడ్ని. ప్రస్తుతం సరైన వర్షాల్లేకపోవడంతో సాగు చేయడానికి వెనుకడుగేయాల్సిన పరిస్థితి నెలకొంది. రబీలో నీరిస్తారా లేదాననే అనుమానం నెలకొంది.

– జనార్దన్‌రెడ్డి, సంగం

కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో అగ్రస్థానం



డీజీపీతో ఎస్పీ, పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): గత నెల 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1012 కేసుల పరిష్కారంలో జిల్లా పోలీస్ యంత్రాంగం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్‌కు ప్రశంసపత్రాన్ని డీజీపీ ద్వార కాతిరుమలరావు శుక్రవారం అందజేశారు. ఆయా స్టేషన్ల పరిధిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో ఇరువర్గాలకు లోక్‌అదాలత్ ద్వారా సత్వర, శాశ్వత పరిష్కారం లభిస్తుందనే అంశమై ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం అవగాహన కల్పించారు. దీంతో జాతీయ లోక్‌అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి. సమష్టి కృషితో మొదటి స్థానంలో నిలిచామని, దీనికి కృషి చేసిన ప్రతి ఒక్కర్నీ ఎస్పీ అభినందించారు. డీజీపీ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్న ఎస్పీ, నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, డీసీఆర్బీ ఎస్సై విజయకుమార్, నవాబుపేట హెచ్‌సీ నాగయ్యకు ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్ది పాటి ప్రసాదరావు, మాజీ అధ్యక్షుడు శ్రీహరి అభినందనలను తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము గనులు మరియు భూగర్భ శాఖ
జిల్లా స్థాయి ఇసుక కమిటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

షార్ట్ టెండరు నోటిఫికేషన్

నెం.2544/DLSC-Sand/NLR/2024 తేది : 05.10.2024

జిల్లా స్థాయి ఇసుక కమిటీ వారు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నందు క్రింది షెడ్యూలులో కనబరిచిన ప్రాంతాలలో ఇసుక త్రవ్వకము (మాన్యువల్), ఇసుక రీచ్ నుండి డిపోలకు / స్టాక్ పాయింట్లకు ఇసుక త్రవ్వకమునకు **ఒక టన్నుకు రూ. 90/-** మరియు రవాణా (ట్రాక్టర్స్‌తో మాత్రమే) చేయుటకు **1 కి.మీ.కు టన్నుకు రూ. 4.90 పైసలు** (GST తో కలిపి) మరియు డిపో / స్టాక్ పాయింట్ నుండి లోడింగ్ చేయుటకు గాను **రూ.20/- ఒక టన్నుకు** నిర్ణయించడమైనది. ఆసక్తి కలిగిన లోడింగ్ కాంట్రాక్టర్లు తమ యొక్క సీల్డ్ టెండర్లను **తేది 07-10-2024న ఉదయం 10.30 గంటల నుండి తేది 16-10-2024 సాయంకాలం 05.00 గంటల వరకు** (ప్రతిరోజు పని దినములలో మాత్రమే) జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి కార్యాలయం, తల్పగిరి కాలనీ, ఆటోనగర్, నెల్లూరు నందు సమర్పించవలెను. ఈ సీల్డ్ టెండర్‌లను **తేది 17-10-2024న ఉదయం 11.00 గంటలకు** జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యుల సమక్షంలో తెరవబడును మరియు టెండర్లను ఖరారు చేయబడును. దీనికి సంబంధించిన పూర్తి వివరముల కొరకు జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి కార్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారిని సంప్రదించగలరు. ఈ టెండర్‌ను వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు పూర్తి అధికారము జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులకు కలదు. ఇతర పూర్తి టెండరు వివరములు https://spsnellore.ap.gov.in/notice_category/tenders/ లో కలవు.

షెడ్యూలు

క్రమ. సంఖ్య	ఇసుక త్రవ్వకములు చేయవలసిన ప్రాంతము	ప్రదేశము పేరు వివరములు	ఇసుక త్రవ్వకాలు చేయవలసిన పరిమాణం(MTs.)
1	మినగల్లు – V	మినగల్లు గ్రామం, బుచ్చిరెడ్డిపాలెం మండలం	70,350
2	ముదివర్తిపాలెం–II	ముదివర్తిపాలెం గ్రామం, ఇందుకూరుపేట మండలం	73,200
3	పల్లిపాడు – V	పల్లిపాడు గ్రామం, ఇందుకూరుపేట మండలం	73,200
4	విరువూరు – V	విరువూరు గ్రామం, పొదలకూరు మండలం	69,750

సం/- కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ మరియు చైర్మన్,
జిల్లా స్థాయి ఇసుక కమిటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

నెల్లూరు ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు సిటీ: నెల్లూరు ఆర్డీఓగా నాగ సంతోష్ అనూష కార్యాలయంలో బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడారు. తన మొదటి పోస్టింగ్ నెల్లూరులో రావడం సంతోషంగా ఉందని చెప్పారు. నెల్లూరుపై కొంత అవగాహన ఉందని, మెరుగైన సేవలను అందిస్తామని వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా, నేరుగా తనను కలవొచ్చని తెలిపారు. తొలుత ఆమెకు పలువురు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలను తెలియజేశారు.

ఏపీఎమ్మెస్ఐడీసీ ఈఈగా విజయభాస్కర్



నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విజయభాస్కర్ బాధ్యతలను శనివారం స్వీకరించారు. ప్రకాశం జిల్లా అధికారిగా పనిచేస్తున్న ఈయన్ను ఎఫ్ఏసీ అధికారిగా నియమించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

నెల్లూరు(క్రైమ్): వాకింగ్ చేస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లారు. వివరాలు.. వెంకట్రామాపురంలో నివాసం ఉంటున్న పద్మావతి నేతాజీ స్కూల్ వీధిలో శనివారం వాకింగ్ చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని రెండు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలు కేకలేసేలోపే దుండగులు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సజావుగా దరఖాస్తుల ప్రక్రియ



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆత్మకూరు: ప్రైవేట్ మద్యం దుకాణాల కోసం నిర్వహిస్తున్న దరఖాస్తుల ప్రక్రియ సజావుగా సాగుతోందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఏ మేరకు దరఖాస్తులు నమోదయ్యాయనే అంశాన్ని సీఐ రమణమ్మను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ సమక్షంలో మద్యం దుకాణాల లాటరీని ఈ నెల 11న నిర్వహించనున్నామని వెల్లడించారు. జిల్లాలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్నామన్నారు. ఆన్‌లైన్లోనూ దరఖాస్తులను దాఖలు చేయొచ్చని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని విక్రయించినా, నిల్వ ఉంచినా, సారాయి కాచినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): భార్య కాపురానికి రాలేదనే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి శనివారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. దగదర్తి మండలం బోడిగుడిపాడుకు చెందిన వెంకటేశ్వర్లు (34), స్వాతి దంపతులు. బేల్దారి పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించే ఈయన మద్యానికి బానిసయ్యారు. దీంతో దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. మద్యాన్ని మానేయాలని భార్య పలుమార్లు ప్రాధేయపడినా పట్టించుకోలేదు. మద్యం మానేస్తేనే కాపురానికి వస్తానని చెప్పి స్వాతి తన పుట్టింటికి ఏడు నెలల క్రితం వెళ్లారు. ఈ తరుణంలో మనస్తాపంతో ఇస్కాన్ సిటీ సమీపంలోని పొలాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఈ నెల రెండున పాల్పడ్డారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు.. అక్కడి నుంచి నారాయణ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎంఏ నేతలకు సత్కారం



నెల్లూరు(అర్బన్): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అమరేంద్రనాథ్ రెడ్డి, నెల్లూరు మెడికల్ సొసైటీ చైర్మన్ రామును నగరంలోని పొగతోటలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, నేతలు రామదాసు, రాఘవులు, శ్రీధర్‌రావు, శంకర్‌రావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులకు విముక్తి

నెల్లూరు(క్రైమ్): బాలకార్మికులతో పనిచేయిస్తున్న ముగ్గురు దుకాణదారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా నగరంలో విస్తృత దాడులను ఐసీపీఎస్ అధికారులు కొంతకాలంగా నిర్వహిస్తున్నారు. తాజాగా ఆటోనగర్‌లోని స్పేర్స్ అండ్ సేల్స్ షాప్‌లో పనిచేస్తున్న బాలకార్మికులు రోషన్, అరవింద్.. ఓల్డ్ స్పేర్స్ షాప్‌లో పనిచేస్తున్న కార్తీక్.. ఏసీ ఎలక్ట్రికల్ వర్క్‌షాపులో పనిచేస్తున్న కాలేషా.. గంగపట్నానికి చెందిన హమీద్‌ను సంరక్షించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి వీరిని అప్పగించారు. బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. దుకాణదారులైన షబ్బీర్, రజాక్, ఖలీల్ అహ్మద్‌పై చర్యలు చేపట్టాలని కోరుతూ వేదాయపాళెం పోలీసులకు ఐసీపీఎస్ ప్రతినిధి సమత ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

In the Court of the Principal District Judge, Nellore

E.P.No.601/2020
O.S.No.61/2017

Pathi Anitha Kumari - DHR
Vs
Menta Subba Rao - JDR

వేలం ప్రకటన

పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు జె.డి.ఆర్.తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తి **తేది.8-11-2024న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల** పై కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొనవచ్చును.

SCHEDULE

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ యిలాకా, స్టోన్‌హౌస్‌పేట సబ్-రిజిస్ట్రారులో చేరిన, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్‌లోని, నెల్లూరు బిట్-2 ఏరియా, బాలాజీనగర్ అను ప్రదేశం, నెం.40/1917రు గల పట్టా దాఖలా సర్వే నెం.524రు యం4-74లు భూమిలో నెం.3ఎ రు ప్లాటు స్థలములో లోగా నిర్మింపబడి యున్న డోరు నెం.27-1-135 రు, అసెస్‌మెంట్ నెం.46135రుకు సంబంధించిన ఇల్లు, స్థలం వగైరాలలో పడమర భాగంలో నాకు హక్కు గల **9 అంకణములా 20 చదరపు అడుగులు లేక 62.059 చదరపు మీటర్లు లేక 74.222 చదరపు గజములు** ఖాళీ స్థలమునకు **హద్దులు :- తూర్పు**: సంగీతా జైన్ గారి ప్రహరీ గోడ ఉత్తరం నుండి దక్షిణముగా 13'-10"లు వరకున్నూ, అచ్చట నుండి ఈ స్థలము తాలూకా సొంత ప్రహరీ గోడ ఉత్తరం నుండి దక్షిణం 6'-5"లు వరకున్నూ. ఈ దిశ కొలత 20'-3"లు. **దక్షిణం** : రోడ్డు. ఈ దిశ కొలత 31'-9"లు. **పడమర** :లేట్ చెన్నావఝల రాధాకృష్ణ గారి సొంత ప్రహరీ గోడ. ఈ దిశ కొలత 24'-6"లు. **ఉత్తరం**:చల్లగొండ్ల శేషయ్య గారి యింటి గోడ మరియు సొంత ప్రహరీ గోడ. ఈ దిశ కొలత 28'-0"లు. ఈ హద్దులలోని **9 అంకణములా 20 చదరపు అడుగులు లేక 62.059 చదరపు మీటర్లు లేక 74.222 చదరపు గజములు** ఖాళీ స్థలమున్నూ, యిందుకు సంబంధించిన రాకపోకల అన్ని విధములైన హక్కులున్నూ మరియు యావత్తు యాజమెంట్ హక్కులతోటిన్నీ.

Amin Value Rs. 22,50,000/-
DHR Value Rs. 30,00,000/-
Further hearing 15-11-2024.

షేక్ అబ్దుల్ ఖాదర్, B.A., B.L.,
న్యాయవాది, నెల్లూరు. Cell : 94939 15558

31లోపు కంప్యూటరీకరణ పూర్తి



మాట్లాడుతున్న గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 78 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని సభ్యుల వివరాలు, రికార్డులు, సంఘాల సమాచార కంప్యూటరీకరణను ఈ నెల 31లోపు పూర్తి చేయాలని డీసీఓ గుర్రప్ప ఆదేశించారు. నగరంలోని డీసీఓ కార్యాలయం నుంచి 78 పీఏసీఎస్‌ల సిబ్బందితో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అన్ని సంఘాల్లో హార్డ్‌వేర్‌కు సంబంధించిన పనులను అక్టోబర్ ఐదులోపు, కంప్యూటర్ పరికరాల ప్రక్రియకు సర్టిఫికేషన్‌ను పదిలోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలాఖరు నాటికి అన్ని సంఘాల్లో పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేపట్టాలని ఆదేశించారు. డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, డివిజనల్ సహకారశాఖ అధికారులు సుధాభారతి, యలమందరావు, రవి చంద్రారెడ్డి, సహకార శాఖ జిల్లా ఆడిట్ అధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జట్ల ఎంపిక

జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలికల ఖోఖో జట్టును ఎంపిక చేశారు. పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో గల క్రీడా ప్రాంగణంలో అండర్ – 14, 17 విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు కోయంబత్తూరులో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు.

- అండర్ – 14 విభాగంలో జిల్లాకు చెందిన భవానీ, గౌసియా.. అండర్ – 17 విభాగంలో ప్రీతి, స్రవంతి ఎంపికయ్యారు.

నిమ్మ ధరలు



పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.45
పండ్లు	: రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్):	రూ.132
లేయర్ (లైవ్)	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.236
స్కిన్‌లెస్ చికెన్:	రూ.260
లేయర్ చికెన్:	రూ.187